క్లుప్తంగా

25న ద్వారకా తిరుమలకు మంత్రి వనిత

ఘన స్వాగతం పలకనున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులయ్యాక తొలిసారిగా ఈనెల 25 న ద్వారకాతిరుమలకు విచ్చేయనున్న రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు ఘన స్వాగతం పలికేందుకు ఆ పార్టీ మండల శ్రేణులు సన్నద్ధం అవుతున్నారు. అందులో భాగంగా స్థానిక కాపు కల్యాణ మండప ఆవరణలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు నిర్ణయించారు. ఈ క్రమంలో ఆ కల్యాణ మండప ప్రాంతాన్ని సోమవారం రాజబాబు పరిశీలించారు. వేదికతో పాటు, షామియానా పందిళ్ల నిర్మాణాన్ని, అలాగే రెండు వేల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలకు భోజన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని నాయకులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి, స్థానిక సొసైటీ చైర్మన్ గుర్రాల లక్ష్మణ్, నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, ఆచంట రాకేష్, బొండాడ వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యావనరుల కేంద్రానికి ప్రింటర్ బహూకరణ



ప్రింటర్, స్కానర్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలోని మండల విద్యావనరుల కేంద్రానికి మండల ఉపాధ్యాయులంతా రూ.50 వేల విలువైన ప్రింటర్, స్కానర్‌ను ఎంఈఓలు గణేష్, పి.గురుమూర్తిలకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కారింకి శ్రీనివాస్, చెరుకు శ్రీనివాస్, ఐవీ రమణ, వర్మ, రమేష్, ఆశోక్, బుల్లిస్వామి, వెంకట్రావు, ఆనందమోహన్, క్రాంతి, శ్రావణి, మిద్దే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా స్వామి బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వరస్వామి

దేవరపల్లి: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) దేవరపల్లి స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కొర్లాం వెంకటేశ్వరస్వామి సోమవారం సాయంత్రం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి ఆయన బదిలీపై దేవరపల్లి వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన డి.సుధ కైకలూరుకు బదిలీపై వెళ్లారు. సీఐ వెంకటేశ్వరస్వామిని సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు



జుజ్జవరపు రాహుల్

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లికి చెందిన జుజ్జవరపు రాహుల్ (24) అనే యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ సోమవారం తెలిపారు. బీటెక్ చదివిన రాహుల్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సి ఉంది. ఈనెల 20న ఇంటి నుంచి బయటకు బైక్‌పై వెళ్లిన రాహుల్ తిరిగి రాలేదని తండ్రి రవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

175 సీట్ల గెలుపులో అందరూ భాగస్వాములు కావాలి

తాళ్లపూడి: 'వై నాట్ 175' అనే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కలను సాకారం చేసేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ మండల మాజీ కన్వీనర్, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు కుంటముక్కల కేశవనారాయణ అన్నారు. మాదిగ సామాజిక వర్గ నాయకులకు భరోసా కల్పిస్తూ సోమవారం మలకపల్లిలో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఆ సామాజికవర్గ ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేశవనారాయణ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రభుత్వం చేసిన మేలును పరిగణనలోకి తీసుకుని పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ కొవ్వూరు అభ్యర్థిని మార్చారని వెనుకడుగు వెయ్యనవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు ముప్పిడి దమయంతి, ఆ పార్టీ దళిత నాయకులు సిర్రా గంగారావు, నూతంగి సురేష్, మర్లపూడి అచ్చిబాబు, సిర్రా గోపి, తిగిరిపల్లి ప్రసాద్, ముమ్మిడి వరపు మదన్, ముప్పిడి శేఖర్, కొల్లి దుర్గారావు, వరిగేటి అశోక్, గెడ్డం సూరయ్య, ఈర్లగడ్డ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో రథంపై స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు



చాగల్లులో జై శ్రీరామ్ నినాదాలతో బైక్ ర్యాలీ చేస్తున్న భక్తులు



ద్వారకా తిరుమల క్షేత్రంలో సీతారాముల రథోత్సవం



దేవరపల్లిలో శ్రీరాముని గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గోపాలపురం మండలం వాదాలకుంటలో రామనామ సంకీర్తన

అంతా రామమయం

- అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేళ కాషాయమయమైన వీధులు
- ద్వారకాతిరుమలతో సహా పలుచోట్ల శోభాయాత్ర, రాములోరి రథోత్సవం



ద్వారకాతిరుమల రథోత్సవంలో ఆకట్టుకున్న బాల రామలక్ష్మణుల వేషధారణ

ద్వారకాతిరుమల: అంతా రామ మయం.. ఈ జగమంతా రామ మయం. ఏ నోట విన్నా.. రామ నామమే వినిపించింది. ఎక్కడ చూసినా.. శోభాయాత్రలు, సీతారాముల కల్యాణ ఘట్టాలే దర్శనమిచ్చాయి. అడుగడుగునా కాషాయం జెండాలు రెపరెపలాడాయి. శ్రీరాముడి జన్మస్థలమైన అయోధ్యలో సోమవారం బాలరాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన వేళ ద్వారకా తిరుమల క్షేత్రంలో హిందువుల శోభాయాత్ర, సీతారాముల రథోత్సవం, కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ వారి ఆలయం వద్ద నుంచి పెద్ద ఎత్తున భక్తులు, భజనమండలి సభ్యులు కోలాటం, డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య శోభాయాత్ర, సీతారామ, లక్ష్మణుల రథయాత్ర ప్రారంభమైంది. ఈ యాత్ర అంబేడ్కర్ సెంటర్ మీదుగా పోలీసు స్టేషన్ కూడలికి, అక్కడి నుంచి శ్రీవారి పాదుకా మండపం వద్దకు చేరుకుంది. ఇక్కడితో శోభాయాత్ర ముగియగా, రథయాత్ర మాత్రం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వరకూ సాగింది. రథంలో కొలువైన సీత, రామ,లక్ష్మణుల ఉత్సవ మూర్తులను అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు. శోభాయాత్రలో ఇద్దరు బాలలు ప్రదర్శించిన బాల రాముడు, లక్ష్మణుల వేషధారణలు చూపరులను ఆకట్టుకుంది. కాగా స్థానిక చెరువు వీధిలో ఉత్సవ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, పానకాన్ని పంపిణీ చేశారు.

దేవరపల్లి: రామనామ స్మరణతో పల్లెలు మార్మోగాయి. అయోధ్యలో సోమవారం బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన నభూతో న భవిష్యతి అనే రీతిలో జరగడంతో గ్రామాలన్నీ కాషాయమయం అయ్యాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు శ్రీరాముని ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రతి ఇంటి ముంగిటా దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తులు టీవీలకు అతుక్కుని స్వామి వారి దివ్యమైన ప్రతిష్ఠా కార్యక్రమాన్ని వీక్షించారు. మండలంలోని బందపురం, యర్నగూడెంలో కోదండరాముని గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆర్య వైశ్య సేవాదళ్ జిల్లా చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీకాకొళపు కాశీకృష్ణ 200 మంది భక్తులకు జై శ్రీరాం..జై శ్రీరాం నామంతో ముద్రించిన టీ షర్టులను పంపిణీ చేశారు.

నల్లజర్ల మండలంలో..

నల్లజర్ల: అనంతపల్లి గ్రామంలోని శ్రీవిశ్వేశ్వర సీతారామ మందిరంలో కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కాశీభట్ల రాంగోపాల శర్మ, పాండురంగ శర్మ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. శెట్టిపల్లి శివ నాగరాజు దంపతులు పూజాదికాలు నిర్వహించారు. బోయపాటి రమేష్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. అలాగే పోతవరంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో మోత్కూరి శ్రీనివాస్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. ఆవపాడు, దూబచర్ల, ఘంటావారిగూడెంలతో పాటు అన్ని గ్రామాలలోనూ వైభవంగా కార్యక్రమాలు జరిగాయి.

వేలివెన్ను, తాడిపర్రుల్లో గ్రామాల్లో..

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్ను, తాడిపర్రు గ్రామాల్లో శ్రీరామ భక్తుల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ నినాదాలతో శోభాయాత్ర నిర్వహించారు. యువత రాముల వారిని పల్లకీలో ఉంచి ఊరేగించారు. మండలంలోని పలు గ్రామాల శ్రీరామ మందిరాల్లో పూజలు, రామ కీర్తనలు, హనుమాన్ చాలీసా పఠించారు. కొన్నిచోట్ల ఆలయాల వద్ద భక్తులకు చలివిడి, పానకం పంపిణీ చేశారు. మరి కొన్ని చోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

గోపాలపురం: మండలంలోని ప్రతి గ్రామంలోనూ రామనామ సంకీర్తనతో పాటు కోలాటాలు నిర్వహించారు. మేళతాళాలతో కోలాహలంగా రామ నామ జపం చేశారు. భక్తులకు ప్రసాదాలు, అక్షతలు పంపిణీ చేశారు. వాదాలకుంటలో వెలగా ప్రసాద్, దొండపూడిలో మద్దు వీరభద్రరావు, పోతిరెడ్డి నాగరాజు, గోపాలపురంలో గెల్లా శ్రీనుబాబు, ముత్యాలరాయుడు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

తాళ్లపూడి: ఆర్ఎస్ఎస్, శ్రీ రామభక్త భక్త బృందం ఆధ్వర్యంలో తాళ్లపూడిలో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామునికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అర్చకులు జంధ్యాల గంగాధరశాస్త్రి, అశ్విని, గోవర్ధనం సాయి ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని వివిధ ప్రాంతాల రామాలయాల నుంచి వచ్చిన పల్లకీలతో శోభాయాత్ర ప్రారంభమైంది. ఇస్కాన్ నుంచి వచ్చిన రథాన్ని పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయాల వద్ద స్థానిక గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సింహాద్రి జనార్దనరావు, నామన పరమేశ్వరరావు, శ్రీరామ చంద్రమూర్తి, అడ్డా మోహన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురంలోనూ రథయాత్ర నిర్వహించారు. పెద్ద రామాలయం వద్ద పూజలు చేశారు. తాడిపూడిలో అన్న సమారాధన జరిగింది.



నల్లజర్ల మండలం అనంతపల్లి విశ్వేశ్వర సీతారామ మందిరంలో కల్యాణోత్సవం

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాలూ రామ నామ జపంలో మునిగితేలాయి. భక్తులు రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించి భక్తులకు పానకం ప్రసాదాలను పంపిణీ చేశారు. పల్లకీల్లో స్వామి అమ్మవారిని ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అన్న సమారాధనలు చేశారు. మండలంలోని ఖండవల్లిలో 30 రామాలయాలు ఉండగా ఇక్కడ మాత్రం ఇంటి పేరున రామాలయాలు ఉన్నాయి.

చాగల్లు: స్థానికంగా జై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. రామాలయాల్లో హోమాలు, పూజలు, రామనామ సంకీర్తనలు నిర్వహించారు. అయోధ్య రామాలయం విశిష్టతను తెలియజేస్తూ గ్రామ వీధుల్లో బైక్ ర్యాలీ చేశారు.

నిడదవోలులో నగర సంకీర్తన

నిడదవోలు: అయోధ్యలో రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో రామనామం చెబుతూ నగర సంకీర్తన చేశారు. అనంతరం రాయపేటలో పులిహోర ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేవారు. కార్యక్రమంలో సంఘాధ్యక్షుడు కేదారిశెట్టి రవికుమార్, కార్యదర్శి కేదారిశెట్టి నెహ్రూ, కోశాధికారి వలివేటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బండి సత్యనారాయణ, నీలం రామారావు, సుంకర నరసింహం తదితరులు పాల్గొన్నారు.



ద్వారకా తిరుమలలో రథంపై కొలువైన సీతారామ లక్ష్మణుల ఉత్సవ మూర్తులు

రామాలయంలో ఎమ్మెల్యే పూజలు

అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా నిడదవోలు పట్టణంలోని రాయపేట కోదండ రామాలయంలో సోమవారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు పూజలు చేశారు. అర్చకులు, కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకట లక్ష్మి, కౌన్సిలర్లు బిర్రె పార్వతి, కొత్తపల్లి సుప్రియ, వైఎస్సార్ సీపీ నాయకులు బిర్రె రామకృష్ణ, మొదలవలస నాని పాల్గొన్నారు.

కొవ్వూరులో మోటార్ సైకిళ్ల ర్యాలీ

కొవ్వూరు: మెయిన్ రోడ్డులోని జూనియర్ కళాశాల సెంటర్లో భక్తులు శ్రీరాముని చిత్ర పటానికి పూలమాలలు వేసి జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. పాదచారులు, వాహనదారులకు అయోధ్య అక్షతలు, ప్రసాదం పంపిణీ చేశారు. మద్దుల సత్యనారాయణ, పోకల రవి, గుల్లపూడి శ్రీనివాస్, పోకల మధు, దేవాతుల ప్రసాద్, ఆర్య వైశ్య సంఘాధ్యక్షుడు మద్దుల సోమరాజు, సత్యవరపు గురునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఒకటో వార్డు, రాజీవ్ కాలనీలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక రామాలయంలో భజన చేశారు.పిక్కి నాగేంద్ర, వైకే శ్రీనివాస్, గోపిశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణం జంక్షన్ వద్ద గల ఆంజనేయ స్వామి గుడి నుంచి శ్రీరామా శోభాయాత్ర నిర్వహించారు. సంస్కృత పాఠశాల ప్రాంగణం నుంచి మెయిన్ రోడ్డులో హిందూ ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ జెండాలు పట్టుకుని మెయిన్ రోడ్డులో నినాదాలు చేసుకుంటూ తీన్‌మాన్ వాయిద్యాలతో శ్రీరాముని చిత్ర పటాన్ని ఊరేగించారు. స్థానిక ఏటిగట్టుపై గల కోదండ రామాలయం నుంచి శోభాయాత్ర యాత్ర నిర్వహించారు. వాడబలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని పది రామాలయాల మీదుగా ఈ యాత్ర సాగింది. శివ సైన్యం పేరుతో వాటర్ ట్యాంకు జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు.



పట్టణంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ సందడి



అన్నవరప్పాడులో పూజలు చేస్తున్న భక్తులు



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో శోభాయాత్ర



రాయపేట కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చీపురుగూడెంలో గ్రామస్తుల రాస్తారోకో



చీపురుగూడెంలో రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

నల్లజర్ల: కొయ్యలగూడెం– నల్లజర్ల రహదారి విస్తరణ పనులను చీపురుగూడెంలో నిబంధనల మేరకు చేపట్టాలనే డిమాండ్‌తో ఆ గ్రామస్తులు సోమవారం ఆ గ్రామ రహదారిపై బైఠాయించి, ఆందోళన చేశారు. గ్రామంలోని పుంతలో ముసలమ్మ ఆలయం ఎదుట నుంచి మురుగు నీరు దిగువకు పోవడానికి గతంలో నుంచి తూరలు ఉండేవి. అందుకనుగుణంగా తూరలు అమర్చడానికి సంబంధిత కాంట్రాక్టర్ తూరలను కూడా సిద్ధం చేశారు. తూరలు అమర్చే దిగువన రెండు కుటుంబాల వారు బోదెను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారు. ఇపుడు తూరలు పెడితే తమ ఇళ్ల ముందు కొంతభాగం పోతుందని సర్పంచ్ వర్గీయులతో చేతులు కలిపి తూరలు అమర్చకుండా రహదారి పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఆర్ అండ్ బీ డీఈపై ఒత్తిడి చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చీపురుగూడెం గ్రామస్తులు, అన్ని పార్టీల నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. దీనిపై డీఈ వెంకటరమణను వివరణ కోరగా కాంట్రాక్ట్‌లో ఉన్నట్టుగానే తూరలు తెచ్చి సిద్ధం చేశాం. సర్పంచ్ వర్గీయులు వద్దంటున్నారు. మరో వర్గం కావాలంటోంది. వెయ్యాలో, వద్దో మీరు మీరు తేల్చుకోండి. అపుడు పని పూర్తిచేస్తామని వివరణ ఇచ్చారు. గ్రామస్తులు రోడ్డుపై బైఠాయింపుతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న నల్లజర్ల సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై సురేష్ తమ సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడారు. నిబంధనల మేరకే పనులు చేయించే ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాస్తారోకోలో చెల్లు పెదరామన్న, సుబ్రహ్మణ్యం, వెంకట్రావు, మోదుగ సుబ్బారావు, గుండాబత్తుల వరుణకుమార్, రాజారావు, జాలాది రవి, జవ్వాది పల్లపురాజు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారందరూ ఎంపీడీఓ రాజశేఖరం, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌లకు వినతి పత్రాలు అందజేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దేవరపల్లి: సంగాయగూడెంకు చెందిన ఎలిపే సూర్యచంద్రం ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్చార్జి డి.సువర్ణరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కరుటూరి ఉషారాణి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

21 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు: అక్రమంగా తరలిస్తున్న 21 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి స్థానిక గామన్ ఇండియా బ్రిడ్జి టోల్ ప్లాజా వద్ద సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆధ్వర్యంలో అధికారులు పట్టుకున్నారు. బియ్యాన్ని, లారీని స్వాధీనం చేసుకున్నామని సబ్ కలెక్టర్ తెలిపారు. ఈ బియ్యం లారీ భువనగిరి నుంచి యానాం వెళుతున్నట్టు గుర్తించామన్నారు. తెలంగాణంలోని రంగారెడ్డి జిల్లాలోని మాడుగుల మండలం అర్ధపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ మహ్మద్ అన్వర్, హైదరాబాద్‌కి చెందిన లారీ ఓనర్ అయితం కృష్ణలపై కేసు నమోదు చేసినట్టు పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ జి.బాపిరాజు తెలిపారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు



నల్లజర్లలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మికి జాయినింగ్ లెటర్ ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

నల్లజర్ల: మండలంలోని 31 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు సమ్మె విరమించి సోమవారం విధుల్లో చేరారు. వారిలో 16 మంది కార్యకర్తలు,15 మంది సహాయకులు ఉన్నారు. వారందరూ నల్లజర్ల ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మికి తమ జాయినింగ్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నల్లజర్ల అంగన్‌వాడీ కార్యకర్త శాంతవల్లి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మె దారి తప్పుతున్నట్టు గ్రహించి తాను విధుల్లో చేరామన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగానే ఉందని ఆమె అన్నారు. వేతన పెంపునకు ప్రభుత్వం కొంత గడువు కోరిందని, అది సహేతుకమే అని ఆమె అన్నారు. తాము చేస్తున్న సమ్మె వల్ల కొన్నిచోట్ల గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిస్థితిని అర్థం చేసుకున్న తాము విధుల్లో చేరామని కలపాల ప్రేమావతి, పీఆర్ రాజేశ్వరి, కనక మహాలక్ష్మి వెల్లడించారు. మండలంలోని 85 అంగన్‌వాడీ సెంటర్లలో మొత్తం 170 మంది కార్యకర్తలు, సహాయకులు ఉండాలి. వాటిలో రెండుచోట్ల ఖాళీలు ఉన్నాయి.

కొవ్వూరు ఐసీడీఎస్ పరిధిలో 91మంది

కొవ్వూరు: విధులకు హాజరు కాని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడంతో కొవ్వూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 91 మంది సమ్మెను విరమించి విధుల్లో చేరినట్టు సీడీపీవో డి.మమ్మీ సోమవారం తెలిపారు. కార్యకర్తలు 39,ఆయాలు 52 మంది విధుల్లో చేరుతున్నట్లు సమాచారం ఇచ్చారని ఆమె వెల్లడించారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 223 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు.గతంలో మూడేళ్ల లోపు సర్వీసు పూర్తి కాని కొంద మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరారన్నారు.

కొవ్వూరు నియోజకవర్గంలో 1,83,405 మంది ఓటర్లు

మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

మండలం పేరు	పురుష	మహిళా	ఇతరులు	మొత్తం ఓటర్లు
కొవ్వూరు పట్టణం	16,223	17,934	03	34160
కొవ్వూరు	27,193	28,013	01	55,207
చాగల్లు	25,582	26,677	01	52,259
తాళ్లపూడి	20,444	21,334	0	41,779
మొత్తం ఓటర్లు	89,442	93,958	05	1,83,405

కొవ్వూరు: నియోజకవర్గ ఓటర్ల తుది జాబితా విడుదలైంది. కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,83,405 మంది. వారిలో పురుషులు 89,442 మంది కాగా, మహిళలు 93,958 మంది. ఇతరుల ఓట్లు ఐదు ఉన్నాయి. కొవ్వూరు పట్టణంలో 29, మండలంలో 53 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలాల వారీగా చాగల్లులో 50, తాళ్లపూడిలో 44 పోలింగ్ కేంద్రాలున్నాయి. నియోజకవర్గంలో గతేడాది అక్టోబర్ 27 నాటికి ఉన్న ఓటర్లతో పోలిస్తే ఇప్పుడు 5,272 మంది ఓటర్లు పెరిగారు. వారిలో పురుషులు 2,587 మంది కాగా, స్త్రీలు 2,686 మంది. కొవ్వూరు పురపాలక సంఘంలో గరిష్ఠంగా 1,454 మంది ఓటర్లు పెరిగితే కొవ్వూరు మండలంలో 1,408 మంది, చాగల్లు మండలంలో 1,383 మంది, తాళ్లపూడి మండలంలో 1,027 మంది ఓటర్లు పెరిగారు. నియోజకవర్గవ్యాప్తంగా గతంలో 1,78,133 మంది ఓటర్లు ఉంటే ఈసారి ఆ సంఖ్య 1,83,405కి పెరిగింది.

నిడదవోలు నియోజకవర్గంలో 2,11,874 మంది ..

నిడదవోలు: నియోజకవర్గ ఓటర్ల తది జాబితాను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి విడుదల చేశారు. నియోజకవర్గంలోని మొత్తం 205 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,11,874 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 1,03,600 మంది, మహిళలు 1,08,269 మంది. ఐదుగురు ఇతర ఓటర్లు కూడా ఉన్నారు. నిడదవోలు మండలంలో 91 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 92,359 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 44,871 మంది, మహిళలు 47,485 మంది. ఉండ్రాజవరం మండలంలోని 58 పోలింగ్ కేంద్రాల పరిధిలో 61,864 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 30,161 మంది, మహిళలు 31,702 మంది. ఇక పెరవలి మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల పరిధిలో 57,651 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 28,568 మంది, మహిళలు 29,082 మంది.



నిడదవోలులో ఓటర్ల తుది జాబితాను రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ప్రదర్శిస్తున్న ఝాన్సీరాణి

నల్లజర్ల మండలంలో 68,216 మంది ..

నల్లజర్ల: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని అన్ని బూత్ లెవెల్ అధికారులు, గ్రామ పంచాయతీలలో తుది ఓటర్ల జాబితాలను ప్రదర్శించినట్టు తహసీల్దారు కిశోర్‌కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 68,216 మంది ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 33,390 మంది, స్త్రీలు 34,824మంది ఉన్నారు. ఇతరులు ఇద్దరు ఉన్నట్టు చెప్పారు.